ఆకట్టుకున్న త్యాగరాయ ఆరాధనోత్సవం

ప్రముఖ కర్ణాటక సంగీత గాయని జయలక్ష్మి కణ్ణన్ సంగీత కచేరి ఆకట్టుకున్నది. ఏజీ కార్యాలయంలోని తెలుగు సాహిత్య సంస్థ, రంజనీ తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో రంగస్థలంలో త్యాగరాయ ఆరాధనోత్సవ కార్యక్రమం వేడుకగా సాగింది. ముఖ్య అతిథిగా హాజరైన స్వరకర్త, సంగీత విశ్లేషకులు పాలగుమ్మి రాజగోపాల్ పంచరత్న కీర్తనల విశిష్టతను వివరిస్తూ సంగీత, సాహిత్య సేవల్లో రంజనీ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ హేమా రెడ్డి, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నాగేశ్వర్‌రెడ్డి, అన్నపూర్ణ, రంజనీ అధ్యక్షురాలు నందిరాజు పద్మలతా జయరాం, ఉపాధ్యక్షులు అద్దేపల్లి రాధాకృష్ణ, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు. – ఖైరతాబాద్, జనవరి 28

వ్యర్థాల సేకరణకు వేలం పాట

వ్యర్థాల సేకరణ వేలం పాటలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చికెన్,మటన్,చేపలు వంటి వ్యర్థాల సేకరణ కోసం బహిరంగ వేలం నిర్వహించారు.ఈ వేలం పాటలో నాలుగు సంస్థలు పాల్గొనగా మైరాన్ ఫుడ్స్ అండ్ ఫీడ్ సంస్థ వారు ముందుకొచ్చినట్లు కమిషనర్ శరత్ చంద్ర పేర్కొన్నారు.మూడు సంవత్సరాలకు 2025 నుంచి 2028 వరకు(36నెలలు) గాను ప్రతి సంవత్సరం ఒక లక్షా 19వేలకు చెల్లించేందుకు ఒప్పందం కుదిరినట్లు ఆయన తెలిపారు.ఈ వేలం పాటలో మేనేజర్ మంజులత,డీఈఈ యాదయ్య,వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్లకు సూచించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ, జనవరి 28: ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. తన నివాసంలో మంగళవారం శంషాబాద్, మణికొండ, నార్సింగి, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధుల పాలన ముగిసి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందన్నారు. దీంతో స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ప్రత్యేక అధికారితో సమన్వయంతో పని చేయాలన్నారు. జటిలమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని వారికి సూచించారు. ఈ సమావేశంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, నార్సింగి, మణికొండ, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్లు కృష్ణమోహన్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్, సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

నారాయణగూడలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

హిమాయత్‌నగర్,జనవరి 28: ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారం చేసుకునే వ్యాపారస్తులపై జీహెచ్‌ఎంసీ ప్లానింగ్ సిబ్బంది,నారాయణగూడ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. ఆపరేషన్ ఫుట్‌పాత్ పేరుతో మంగళవారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా పరిసర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల ఉన్న ఆక్రమణలను తొలగించారు. ఫుట్ పాత్‌లపై చిన్న,చిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారస్తుల దుకాణాలను తొలగించడంతో తమ ఉపాధిని దెబ్బతీశారంటూ పోలీసులపై మండిపడ్డారు. ఫుట్‌పాత్ ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలం కావడంతోనే ఆక్రమణలను తొలగింపు చర్యలు చేపట్టినట్లు నారాయణగూడ ట్రాఫిక్ సీఐ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచండి

బిల్‌కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రవికుమార్

బండ్లగూడ,జనవరి 28 : ఆర్థిక సంవత్సరం సమీపిస్తున్న తరుణంలో ఆస్తి పన్ను వసూళ్లలో మరింత వేగం పెంచాలని రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ పేర్కొన్నారు.ఆయన మంగళవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బిల్‌కలెక్టర్లతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వంద శాతం ఆస్తి పన్నులను వసూళ్లు చేయాలని బిల్‌కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేశారు.పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి

బండ్లగూడ,జనవరి 28 : వినాయక్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు మంగళవారం కమిషనర్ శరత్ చంద్రకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు మురళి కృష్ణ, బాలు, కృష్ణ, శ్రావణ్, సందీప్,రామాంజనేయులు తదితరులు మాట్లాడుతూ వినాయక నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కమిషనర్ శరత్‌చంద్రకు విజ్ఞప్తి చేశారు.

వినాయక్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

విలీన గ్రామాల్లో ఆత్మీయ భరోసా ఇవ్వాలి

శంషాబాద్ మున్సిపాలిటీలో విలీన గ్రామాల్లో 338 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఆయా గ్రామాలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలో విలీనం చేయడంతో భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. కాని గ్రామాలను విలీనం చేయడంతో వారికి అవకాశం లేకుండా పోతుందని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం తమకు వర్తించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. శంషాబాద్ మండలంలోని పెద్దగోల్కొండ 40 మంది కూలీలు,చిన్నగోల్కొండ 103 మంది కూలీ లు, రషీద్‌గూడ 28 మంది కూలీలు,హమీదుల్లానగర్ 34,బహదూర్‌గూడ 58 మంది కూలీలు, ఘాన్సిమియాగూడ 28 మంది కూలీలు, శంకరాపూర్ 47 మంది మొత్తం 338 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి దూరం చేయొద్దని పలువురు కూలీలు కోరుతున్నారు. – శంషాబాద్ రూరల్

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే విధంగా చూడాలి

ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని వారికి ఏడాదికి రూ. 12వేలు ఇస్తామన్న ప్రభుత్వం... మున్సిపాలిటీగా మా గ్రామాలను మార్చడంతో మాకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రావడంలేదు. మా గ్రామంలో కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేసే విధంగా చూడాలి. – ముక్తర్, రషీద్‌గూడ

కూలీల పొట్ట కొట్టొద్దు

ఏడాదికి రూ. 12వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మా గ్రామాలను మున్సిపాలిటీలో కలపడంతో మాకు కూలీ పని లేకుండా పోతుంది. మా కూలీల పొట్టకొట్టొద్దు. మాకు ఏడాదికి రూ.12వేలు వచ్చే విధంగా ప్రభుత్వం మాకు పని కల్పించాలి. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తించే విధంగా చూడాలి.

రాణి, పోశెట్టిగూడ

భూమిలేని పేదలను ఆదుకోవాలి

భూమిలేని పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి. ఓట్ల సమయంలో భూమిలేనివారికి ఏడాది రూ. 12వేలు ఇస్తామని చెప్పిన నాయకులు మా గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయడంతో మాకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం రాదు అంటున్నారు. మాకు పథకం వచ్చేవిధంగా ప్రభుత్వం చొరవతీసుకొని ఆదుకోవాలి. – పద్మమ్మ, రషీద్‌గూడ

డిగ్రీ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులను అభినందిస్తున్న విజయ్‌కుమార్

హిమాయత్‌నగర్,జనవరి 28: ఇటీవల ప్రకటించిన డిగ్రీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టరు ఫలితాల్లో డిగ్రీ విద్యార్థులు ప్రతిభ చాటారు.మంగళవారం నారాయణగూడ లోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో పలువురు విద్యార్థులకు అభినందన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ సెమిస్టర్‌లో 193 మంది విద్యార్థులకు 184 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసం,పట్టుదలతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్,డాక్టర్ రామలక్ష్మి,అధ్యాపకులు డాక్టర్ గడ్డం ఆదాం, డాక్టర్ భిక్షపతి,నాగరత్నం,డాక్టర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 1వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలి

శంషాబాద్ పట్టణంలో కార్మికులతో మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి నర్ర గిరి

శంషాబాద్ రూరల్, జనవరి 28: శంషాబాద్ పట్టణంలోని లేబర్ అడ్డ వద్ద కార్మికుల కోసం ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి నర్ర గిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని కార్మికుల(లేబర్) అడ్డ వద్ద కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమై వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొంతకాలంగా భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు లేబర్ అడ్డాలో కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు లేబర్ అడ్డాకు ప్రత్యేక స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అందరికి ప్రతిరోజు పనిలేకపోవడంతో కార్మికులు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనికోసం అడ్డ వద్ద వేచి చూసి చివరకు పని దొరకకపోవడంతో ఆకలితో ఇంటికి వెళ్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఐదు రూపాయల భోజనంతో పాటు కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, నరేష్ భవన నిర్మాణ సంఘం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో పచ్చదనం పెంపునకు ప్రత్యేక కృషి

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో పార్కులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న యూబీడీ డీడీ శ్రీనివాస రావు.

జూబ్లీహిల్స్, జనవరి 28 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లోని కాలనీ పార్కులలో పచ్చదనం పెంపునకు చర్యలు చేపడుతున్నామని యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస రావు తెలిపారు. శేరిలింగంపల్లి జోన్ డీడీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మంగళవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఉన్న పార్కులలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ పార్కులలో ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ పచ్చదనం మరింత పెంపొందించి ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారురు. యూసుఫ్‌గూడ సర్కిల్ పార్కులలో గ్రీనరీ అభివృద్ధి కోసం టెండర్ల ప్రక్రియ ముగిసిన అనంతరం పనులు చేపడతామని తెలిపారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

వెంగళరావునగర్ డివిజన్‌లోని పార్కులలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బుధవారం ప్రారంభించనున్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఆయా పార్కులలో ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్స్ ప్లే గ్రౌండ్‌లు, కాంపౌండ్ వాల్స్, మధురానగర్ డీ బ్లాక్, జీ బ్లాక్ పార్కులలో ఎమ్మెల్యే అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో బీసీలు ఎదగాలి

బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డాక్టర్ పూర్ణచందర్ రావు

కర్పూరి ఠాకూర్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూర్ణచందర్ రావు, సంగెం సూర్యారావు తదితరులు

ఖైరతాబాద్, జనవరి 28 : భారతరత్న, బహుజన నేత, దివంగత బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ స్ఫూర్తితో బీసీలు రాజ్యాధికారం సాధించుకోవాలని బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్, రిటైర్డ్ డీజీపీ డాక్టర్ పూర్ణచందర్ రావు అన్నారు. బీసీ టైమ్స్, బీసీ సమాజ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కర్పూరి ఠాకూర్ జయంతోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఠాకూర్ లాంటి బీసీ మాణిక్యాల చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. బీసీ సామాజిక వర్గమైన నాయీ బ్రాహ్మణ కులంలో పుట్టి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం గొప్ప విషయమన్నారు. బీసీలను అధికారంలోకి రానివ్వకుండా అణదొక్కుతున్నారని ఇలాంటి పరిస్థితుల్లో కర్పూరి ఠాకూర్ జీవితాన్ని మార్గదర్శంగా తీసుకోవాలన్నారు. బ్రిటిష్ కాలంలో గ్రామాల్లో అగ్రకులాల మాటలే చెల్లుబాటయ్యేదని, నేడు స్వాతంత్ర భారతదేశంలోనూ అదే పరిస్థితి నెలకొని ఉందని, బిరుదులు బీసీలకు ఇచ్చి అధికారాన్ని వారు చేజిక్కించుకుంటున్నారన్నారు. 50 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో వెనుకాముందు అవుతున్న పాలకులు, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అడగగానే ఇచ్చేయడం దారుణమన్నారు. కేంద్రంలో కులగణన చేయాలని కోరుతున్న కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేయాలని డిమాండ్ చేయాలన్నారు. ఇక నైనా బీసీలు మేల్కొనాలని, కేవలం కొన్ని కులాలు మాత్రమే అనుభవిస్తున్న రాజ్యాధికారాన్ని దక్కించుకోవాలన్నారు. అనంతరం అన్నవరపు బ్రహ్మయ్య, జి. లక్ష్మీ నరసయ్య, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, వనభట్ల సుబ్బయ్య, డాక్టర్ ప్రభాకర్‌ల సంపాదకత్వంలో వెలువడిన 'కర్పూరి ఠాకూర్' గ్రంథాన్ని బీసీ సమాజ్ అధ్యక్షులు సంగెం సూర్యారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు మోడల శ్రీనివాస్ సాగర్, బొడ్డుపల్లి చంద్రశేఖర్, నరెడ్ల శ్రీనివాసులు, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాల్వాయి శ్రీనివాస్, పల్లె సత్యం వంశరాజ్, అన్నవరపు బ్రహ్మయ్యతో కలిసి ఆవిష్కరించారు.

రుణాలు ఇప్పించేందుకు..డబ్బులు వసూళ్లు

మహిళా సమాఖ్యల సమావేశంలో ఫిర్యాదులు



బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లో మహిళా సమాఖ్యలతో సమావేశమైన యూసీడీ విభాగం పీవో సురేష్ తదితరులు

బంజారాహిల్స్, జనవరి 28: మహిళా సమాఖ్యలను మరింతగా బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేసేందుకు జీహెచ్‌ఎంసీ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమాఖ్యల సమావేశంలో రసాభాసాగా మారింది. యూసీడీ విభాగం పీవో సురేష్, డీఎంసీ భానుకు పలువురు మహిళా సమాఖ్య నేతలు ఫిర్యాదులు చేశారు. కొంతమంది ఆర్‌పీల వ్యవహారశైలిపై ఆరోపణలు చేశారు. మహిళా సమాఖ్యలకు రుణాలు ఇప్పించేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ సాక్ష్యాలను చూపించడంతో అధికారులు అవాక్కయ్యారు. రెండేళ్లుగా సమాఖ్యల ఎన్నికలు జరగలేదని, అధికారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారంటూ పలువురు సమాఖ్య నాయకురాళ్లు ఆరోపించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇటీవల సర్వేలు నిర్వహించగా దానిలోనూ బయటి వ్యక్తులు పాల్గొన్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని, సమాఖ్యలను బలోపేతం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్లు, కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాట్ల ప్రక్రియ నడుస్తోందని, సమాఖ్యలు మరింత చురుగ్గా పనిచేయాలని అధికారులు సూచించారు.

ర్యాష్ డ్రైవింగ్‌తో.. యువకులకు గాయాలు

బంజారాహిల్స్,జనవరి 28: బైక్ మీద వేగంగా వెళ్తూ కారును ఢీకొట్టిన ఇద్దరు యువకులు గాయాలపాలైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫస్ట్‌లాన్సర్ సమీపంలోని సయ్యద్‌నగర్‌కు చెందిన విద్యార్థి(17) తన స్నేహితుడి(17)తో కలిసి సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బైక్ మీద బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 92మీదుగా వెళ్తున్నారు. అతివేగంతో ఉన్న బైక్ అదుపు తప్పి ముందు వెళ్తున్న కారును ఢీకొట్టడంతో గాల్లోకి ఎగిరి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా స్థానికులు అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. బైక్ నడిపిన యువకుడికి లైసెన్స్ లేదని పోలీసుల విచారణలో తేలింది. దీంతో ర్యాష్ డ్రైవింగ్ చేయడంతో పాటు కారును ఢీకొట్టిన విద్యార్థి మీద బీఎన్ఎస్ 125 (ఏ), 281తో పాటు ఎంవీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అడ్డగుట్టలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

సికింద్రాబాద్, జనవరి 28: అడ్డగుట్ట డివిజన్ పరిధిలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సహకారంతో అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి ఆదేశాల మేరకు తుకారంగేట్, నందనార్ నగర్, గణేశ్ ఆలయం, ఇంద్రానగర్ సి కాలనీల్లో మంగళవారం హైమాస్ట్ లైట్లను నూతనంగా ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనుల్లో భాగంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని నాయకులు తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రాంతాల వారీగా ముందస్తు చర్యలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను వెంటనే అధికారులతో కలిసి పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, ఎల్లయ్య, నర్సింగ్, దేవయ్య, శంకర్, రామప్ప, రాజు, ఇస్మాయిల్, కిట్టు, రాజు, అమర్, శ్రీనివాస్, మహేందర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

త్రినాథరావుకు డాక్టరేట్ ప్రదానం

ముషీరాబాద్: ఏపీ ఖైజో ప్రొఫెటిక్ యూనివర్శిటీ, సౌత్ ఆఫ్రికా యూనివర్శిటీ సంయుక్తంగా నగరానికి చెందిన డాక్టర్ సీహెచ్ త్రినాథరావుకు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసింది. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ డీఎల్‌కే పిలిప్స్ పాల్గొని డాక్టర్ ఆఫ్ ఫిలాస ఫి, డాక్టర్ ఆఫ్ డివినిటీ అందించి సత్కరించారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 6వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఎస్ఎల్‌పీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు వన్‌టైం చాన్స్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 13వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను మార్చి నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నిర్మాణ పనులకు శంకుస్థాపన

అమీర్‌పేట్: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో సనత్‌నగర్ ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో రూ.28 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ కొలను లక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాల్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ డీఈ సాయి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 28: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని పీజీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్‌ఎంసీ కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 6వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 11వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బోయిగూడలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్‌పేట్, జనవరి 28: బోయిగూడలోని మేకల మండి ఎదురుగా ఉన్న గాంధీనగర్ మార్గంలో రూ.19.25 లక్షల వ్యయంతో డ్రైనేజీ లైన్ రీ–మోడలింగ్ పనులను మంగళవారం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో నూతన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేసి అనేక అభివృద్ధి పనులను పూర్తి చేయడం ద్వారా ప్రజలు ఎన్నో ఏండ్ల నుంచి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించామని ఆయన అన్నారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, జీహెచ్‌ఎంసీ డీఈఈ ఆంజనేయులు, జలమండలి డీజీఎం ఆశిశ్, బీఆర్ఎస్ నాయకులు జి.పవన్‌కుమార్‌గౌడ్, ఏసూరి మహేశ్, వెంకటేశన్‌రాజు, కె.లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, వెంకటరమణ, అరుణ్‌గౌడ్, రవికాంత్, దయానంద్, విజయ్‌కుమార్, ఐశ్వర్య, సీనియర్ సిటిజెన్స్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.